## క్లుప్తంగా

### తహశీల్దార్‌కు సన్మానం



తహశీల్దార్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మాడ్గుల: మాడ్గుల మండలానికి తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వినయ్‌సాగర్‌ను బీఆర్ ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. తహశీల్దార్ కార్యాలయంలో వారు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లాలయ్య గౌడ్, నిరంజన్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### గాంధీ ఆశయ సాధనకు కృషి

డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా



మాట్లాడుతున్న వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్: ప్రతిఒక్కరూ గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా పేర్కొన్నారు. మండల కేంద్రంలో మహాత్మ గాంధీ జయంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రామకృష్ణగుప్తా, వీరేందర్‌గుప్తాతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గాంధీజయంతి వేడుకలను పురస్కరించుకుని బుధవారం ఉదయం 8:30 గంటలకు గాంధీనగర్ కాలనీలో గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

### వీధి లైట్ల మంజూరు



వీధి లైట్లను చూపిస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు అరవింద్‌నాయక్ తదితరులు

యాచారం: భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మంతన్‌గౌరెల్లి గ్రామానికి మంగళవారం 27 వీధి లైట్లు మంజూరు చేయించారు. ఈ వీధి లైట్లను గ్రామ ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొర్ర అరవింద్‌నాయక్ పర్యవేక్షణలో గ్రామంలోని స్తంభాలకు బిగించారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తదితరులు

తలకొండపల్లి: వీరన్నపల్లికి చెందిన బెక్కరి సుప్రీత్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, శ్రీరాములు, లింగం గౌడ్, సురేష్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు అనిల్ గౌడ్, రఘుపతి రెడ్డి, రాఘవేందర్ యాదవ్, భరత్ రెడ్డి, కిషన్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

### నేడు గాంధీ జయంతి

ఆమనగల్లు: పట్టణంలోని గాంధీచౌక్ వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు మహాత్మాగాంధీ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వీరబొమ్మ రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



సత్కరిస్తున్న కౌన్సిలర్ లక్ష్మణ్

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న ఉపాధ్యాయులను మున్సిపల్ కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ ఘనంగా సత్కరించారు. పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యావతి, విద్యావతమ్మ, కనకదుర్గ, బాబులాల్‌లను కౌన్సిలర్ సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, విజయలక్ష్మి, స్వాతి, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాడ్గుల: కేజీబీవీలో బతుకమ్మను పేర్చుతున్న ప్రత్యేక అధికారి రేఖ, ఉపాధ్యాయినులు



ఆమనగల్లు: బాలికల ఉన్నత పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయినులు, విద్యార్థినులు

## ముందస్తుగా బతుకమ్మ సంబురాలు

నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, మండల కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులు ముందస్తుగా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ఉపాధ్యాయులు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలన్నారు.




ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయినులతో విద్యార్థినులు



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబరాలు




ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు



యాచారం: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయినులు



కడ్తాల్: ఓ ప్రైవేటు స్కూల్లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్మినేడు ప్రభుత్వ పాఠశాలలో..

## వైద్య పరీక్షలు తప్పనిసరి

డాక్టర్ సైదమ్మ



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టరు సైదమ్మ తదితరులు

తలకొండపల్లి: పారిశుద్ధ్య కార్మికులు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి, డాక్టర్ సైదమ్మ పేర్కొన్నారు. మంగళవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని వీరన్నపల్లి, వెంకట్రావ్‌పేట్, గడ్డమీది తండా, కోరింతకుంట తండా, బల్సులపల్లి తండా వాసులకు గట్టు ఇప్పలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి డాక్టర్ సైదమ్మ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సైదమ్మ మాట్లాడారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత అలవర్చు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ ఆంజనేయులు, ఏఎన్‌ఎం ఉష్శశ్రీ, సునీత, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్యదర్శులు వినోద్, జమీరోద్దీన్, రాణి, తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్



మాట్లాడుతున్న దశరథ్‌నాయక్

కడ్తాల్:ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ పేర్కొన్నారు. దసరా లోపు రైతాంగానికి ఇచ్చిన హామీలను పరిష్కరించాలని, లేని యెడల ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులతో కలిసి మహాధర్నా చేపట్టనున్నట్టు ఆయన హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు అనేక హామీలను గుప్పించారని, అధికారంలోకి వచ్చిన తర్వాత తుంగలో తొక్కారని విమర్శించారు. ఖరీఫ్ సీజన్ ముగిసి, రబీ ప్రారంభమవుతున్నా ఇప్పటికీ రైతుభరోసా అందలేదని, మృతి చెందిన రైతు కుటుంబాలకు బీమా కూడా మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు గడిచినా అన్నిరంగాల్లో విఫలమయిందన్నారు. ఈ సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, సింగిల్‌విండో డైరెక్టర్లు వీరయ్య, సేవ్యానాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నర్సింహ, పాండునాయక్, వెంకటేష్, ముత్యాలు, అంజి, భిక్షపతి, భీమన్, మహేశ్, లక్ష్మణ్, శ్రీను, రాజు, శ్రీకాంత్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా



పాఠశాలకు ఎలక్ట్రానిక్ బెల్‌తో పాటు టై, బెల్టులు పంపిణీ చేస్తున్న భాస్కర్ రెడ్డి తదితరులు

మంచాల: లింగంపల్లి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని దాత అనిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మంచాల మండలంలోని లింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో 100 మంది విద్యార్థులకు టై, బెల్టులు, గుర్తింపు కార్డులు, పాఠశాలకు ఎలక్ట్రానిక్ బెల్ అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తను ఇదే పాఠశాలలో చదువుకున్నారన్నారు. తను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్తారిరాజిరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, అర్చన, సురేందర్‌రెడ్డి, రాజేందర్, జగన్నాథ్, అపర్ణ, బాలరాజు, యాదయ్య, శిరీష, స్థానిక పెద్దలు ఐలేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.




గురునానక్ సమ్మిట్‌లో బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు అరవింద్ కృష్ణతో పాటు కళాశాల యాజమాన్యం

## వ్యక్తిత్వ వికాసానికి ఆవిష్కరణలు

- గురునానక్‌లో జాతీయ స్థాయి అండర్ 25 సమ్మిట్

ఇబ్రహీంపట్నం రూరల్: వ్యక్తిత్వ వికాసానికి నూతన ఆవిష్కరణలు దోహదపడుతాయని అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు, చలన చిత్ర నటుడు అరవింద్‌కృష్ణ, యువ నేపథ్య గాయకుడు కునాల్‌కిషోర్ పేర్కొన్నారు. గురునానక్ విద్యాసంస్థలో జాతీయ స్థాయి అండర్ 25 సమ్మిట్ మంగళవారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకునే విధంగా, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నూతన ఆవిష్కరణలను ఆవిష్కరింపజేసే రీతిలో వేదికను నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారివారి ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గురునానక్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ జీఎస్ కోహ్లీ, ఎండీ డాక్టర్ హెచ్‌ఎస్ సైనీ, డైరెక్టర్ శ్రీనాథరెడ్డి, డాక్టర్ సంజీవ్ శ్రీవాస్తవ, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరావు, జాయింట్ డైరెక్టర్ పార్థసారథి, వినయ్‌చోప్రా, డైరెక్టర్ కార్పొరేషన్ రిలేషన్స్ తదితరులు పాల్గొన్నారు.

### సామాజిక ఆరోగ్య కేంద్రం పరిశీలన

యాచారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు కలెక్టర్ సూచన మేరకు సందర్శించి మరమ్మతుల పనులపై చర్చించారు. దీని కోసం ఎన్ని నిధులు ఖర్చు చేయాలనే విషయాన్ని కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్ పేర్కొన్నారు.

## నీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దు

మండల ప్రత్యేక అధికారి రాజారత్నం



సమావేశంలో మాట్లాడుతున్న రాజారత్నం

కేశంపేట: గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా మిషన్ భగీరథ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రాజారత్నం అన్నారు. మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామ శివారులోని రైతువేదికలో మంగళవారం గ్రామ పంచాయతీ మంచినీటి సహాయకులకు నాలుగురోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ తాగునీటి సహాయకులు క్షేత్రస్థాయిలో నీటి సరాఫరాలో ఇబ్బందులు లేకుండా స్వచ్ఛమైన తాగునీటిని అందించాల న్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నీటిని అందించాలని, నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. గ్రామాల్లో ఎలక్ట్రిక్ సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ బోరుమోటార్ల రిపేర్, బోరు పంపుసెట్ల రిపేర్, ప్లంబింగ్, పైపులైన్ లీకేజీ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవి చంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, ఏఈలు నాగమణి, ప్రదీప్, ప్రవళిక, ఇప్పలపల్లి పంచాయతీ కార్యదర్శి పాండు తదితరులు పాల్గొన్నారు.

**ఫీవర్ సర్వేను నిర్వహించాలి**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాకార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మండల ప్రత్యేక అధికారి రాజారత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఆశలు గ్రామాల్లో ఫీవర్ సర్వేను నిర్వహించాలని సూచించారు. ఇమ్యూనైజేషన్, ఫ్రైడే డ్రై డే లాంటి కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని ఆయన తెలిపారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పేరుకుపోతున్న చెత్త..!

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



తొర్రూర్ రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్తాచెదారం

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధి, ఆయా మండల పరిధిలో స్వచ్ఛతా హీ సేవ పేరిట అనేక కార్యక్రమాలను అధికారులు నిర్వహిస్తున్నప్పటికీ పరిసరాల శుభ్రత విషయంలో ఇటు అధికారులు, అటు స్థానికులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏ కాలనీలో చూసినా చెత్త పేరుకుపోతుంది. అక్కడ శుభ్రం చేసేవారు కరువవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో పట్టించుకునే అధికారులు లేరని చెబుతున్నారు. దీంతో తాము విషజ్వరాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. చెత్త తొలగింపజేసే విషయంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంజాపూర్ నుంచి తొర్రూర్‌కు, ఇంజాపూర్ నుంచి సాహెబ్ నగర్‌కు వెళ్లే రోడ్డు మార్గాల్లో డంపింగ్ యార్డ్‌ను తలపించేలా చెత్త పేరుకుపోతుందని ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఇళ్లలో వెలువడే చెత్తను నేరుగా స్వచ్ఛ ఆటో సిబ్బందికి అందించాలని అధికారులు ప్రచారం నిర్వహిస్తున్నా కొంతమంది స్థానికుల్లో మార్పు కనిపించడం లేదు. ఎక్కడ ఖాళీ స్థలం కనపడితే అక్కడే చెత్త వేస్తూ పరిసరాల అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. ఇలా బాధ్యత లేకుండా ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసే వారిని గుర్తించి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### అమ్మవారి ఉత్సవాలకు సర్వం సిద్ధం



ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని శివాలయం వీధిలో మండపం

ఇబ్రహీంపట్నం రూరల్: దుర్గమాత ఉత్సవాలకు నిర్వాహకులు సర్వం సిద్ధ చేశారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో పూజలు కొనసాగనున్నాయి. ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్‌లో 25వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అంగరంగ వైభవంగా నిర్వహించే దుర్గమాత నవరాత్రులకు సర్వం సిద్ధం చేశారు. శివాలయం వీధిలో ఏర్పాటు చేయనున్న అమ్మవారికి పూజల నిమిత్తం ఏర్పాట్లు చేశారు.

### నేడు మాంసం దుకాణాలు బంద్

తుర్కయంజాల్: గాంధీ జయంతి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో మటన్, చికెన్ దుకాణాలను మూసి వేయాలని మున్సిపల్ కమిషనర్ కే. అమరేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో ఆయా దుకాణాల యజమానులు తమ ఆదేశాలను బేఖాతరు చేసి విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలోని శివాలయంలో శ్రీ కిషన్‌ప్రభు ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో మంగళవారం భగవద్గీత పారాయణం, ప్రచార సమితి కార్యవర్గ ఎన్నిక సమావేశంలో ఎమ్మెల్యే, గంగాపురం ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ పరమాత్మానందగిరిస్వామిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంసార జీవితంలో మనందరం బందిలుగా ఉన్నామని, దైవచింతన ఉంటేనే శాంతి ఉంటుందన్నారు. కిషన్ ప్రభు ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దైవ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా కృషి చేస్తామన్నారు.

**భగవద్గీత చదవాలి**

ప్రతి హిందూ భగవద్గీత చదవాలని గంగాపురం ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ పరమాత్మానందగిరి స్వామి అన్నారు. ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని, ధర్మ రక్షణకు కృషి చేయాలన్నారు.

## పాఠశాలలను అభివృద్ధి చేసుకుందాం

బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్‌గౌడ్



విద్యార్థులకు ఫుట్‌బాల్ కిట్ అందజేస్తున్న వెంకటేశ్‌గౌడ్

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకునేందుకు అందరం కృషి చేద్దామని బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి ఎలిగని వెంకటేశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బాకారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో పాల్గొనాలని సూచించారు. అనంతరం మాజీ సర్పంచ్ బద్దుల సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ.. అక్షరాస్యతలో బాకారం గ్రామం రాష్ట్రపతి అవార్డు పొందిందన్నారు. చదవడం, రాయడంలో గ్రామంలో రాత్రి పూట బడులు ఎంతో చక్కగా కొనసాగాయని పేర్కొన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత విద్యలో రాణిస్తూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు వాలీబాల్ కిట్, టీ షర్ట్స్, నెట్‌సెట్, ఫుట్‌బాల్ వివిధ క్రీడలకు సంబంధించిన సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఎలిగని భిక్షపతిగౌడ్, కొండా శేఖర్‌గౌడ్, యాదయ్యగౌడ్, ఎలిగని శ్రీకాంత్‌గౌడ్, కొమ్మిడి రాజేందర్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.